
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.7 / కనిష్ఠం 20.5



కామారెడ్డి జిల్లా వార్తలు

5

శుక్రవారం 23 ఆగస్టు 2024

ఓపెన్ స్కూల్ ద్వారా ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 22: తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులు ప్రవేశాల కోసం వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక గోపాల్‌పేట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకట్‌రామిరెడ్డి కోరారు. మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు 10వ తరగతిలో ప్రవేశం పొందటానికి 14 సంవత్సరాలు నిండి ఉండాలని, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం 15 సంవత్సరాలు నిండి ఉండాలని ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబరు 10వ తేదీ లోగా అడ్మిషన్లు పొందాలని ఆయన కోరారు. విద్యార్థులు ఓపెన్ స్కూల్ ప్రవేశాల కోసం తమను సంప్రదించాలని ఆయన కోరారు.



కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



జ్వరం భయం

- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- చిన్నారులు, వృద్ధులపై తీవ్ర ప్రభావం
- అధికారిక లెక్కల ప్రకారం 8 నెలల్లో 80కిపైగా కేసుల నమోదు
- కేవలం జూలై, ఆగస్టు నెలల్లోనే 65కుపైగా డెంగ్యూ కేసుల నమోదు
- కామారెడ్డి, మాచారెడ్డి, రామారెడ్డి మండలాల్లోనే ఎక్కువ కేసులు
- పారిశుధ్య పనుల్లో తీవ్ర జాప్యం
- ఉన్నతాధికారులు హెచ్చరించినా బేఖాతర్
- అధికారుల నిర్లక్ష్యంతో పారిశుధ్య లోపం

కామారెడ్డి టౌన్, ఆగస్టు 22: జిల్లాపై డెంగ్యూ పంజా విసురుతోంది. నిత్యం దోమకాటు బారిన పడి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రజలు క్యూ కడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో సీజనల్ వ్యాధులతో ప్రజలు కిక్కిరిసిపోతుంటే డెంగ్యూ, మలేరియా వ్యాధులతో నిత్యం పదుల సంఖ్యలో ఆసుపత్రులలో చేరుతున్నారు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం గడిచిన 8 నెలల్లో 80కి పైగా డెంగ్యూ కేసులు నమోదు కాగా ఇందులో కేవలం జూలై, ఆగస్టు నెలల్లోనే 65కుపైగా కేసులు నమోదు కావడం విస్మయానికి గురి చేస్తోంది. ఇక ప్రైవేట్ ఆసుపత్రుల్లో పొందుతున్న వారి సంఖ్య లెక్కేలేదు. ఏ ప్రైవేట్ ఆసుపత్రిలో చూసినా కనీసం 5 నుంచి 10 డెంగ్యూ కేసులతో చికిత్స పొందుతున్నారంటే ఎంతమేర ప్రభావం ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఈ డెంగ్యూ కేసులు కామారెడ్డి, రామారెడ్డి, మాచారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి, లింగంపేటలతో పాటు మరికొన్ని మండలాల్లో ఎక్కువగా నమోదు అవుతుండడంపై ఆయా ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. జ్వరంతో బాధపడుతూ ఇటీవల చాలా మంది ఆసుపత్రులలో చేరుతుండడంతో జీజీహెచ్, బాన్సువాడ, ఎల్లారెడ్డి ఆసుపత్రులతో పాటు పలు సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు సైతం నిత్యం ఓపీ, ఐపీలతో ఆసుపత్రులు రద్దీగా మారుతున్నాయి.

8 నెలల్లో 80 డెంగ్యూ కేసుల నమోదు

జిల్లాలో గడిచిన 8 నెలల్లో 80 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇందులో జూలై, ఆగస్టు నెలలోనే 65 కేసులకు పైగా నమోదయ్యాయంటే ఎంతమేర డెంగ్యూ విస్తరిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా కామారెడ్డి డివిజన్‌లోనే ఈ కేసుల సంఖ్య అధికంగా నమోదు అవుతున్నాయి. ఇందులోనూ జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో కేసులు నమోదు కావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. కామారెడ్డి మున్సిపల్‌లో వందలకొద్ది పారిశుధ్య సిబ్బంది ఉన్న ఆయా వార్డుల్లో వారు చేస్తున్న పని తీరులో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ రెండు నెలల కాలంలో ముఖ్యంగా డ్రైవర్స్‌కాలనీ, పీఎంహెచ్ కాలనీ, అశోక్‌నగర్, ఇస్లాంపూర, బతుకమ్మకుంట, సైలాన్‌బాబా కాలనీల్లో దోమకాటు బాధితులు ఎక్కువగా నమోదవుతున్నారు. ఇక రామారెడ్డి మండలం అన్నారం పీహెచ్‌సీ పరిధిలోనూ పదుల సంఖ్యలోనే డెంగ్యూ కేసులు నమోదవుతున్నారు. మాచారెడ్డి, పల్వంచ మండలాల్లోని ఆయా గ్రామాల్లో డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ మండలాల పరిధిలో పారిశుధ్య లోపం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

పారిశుధ్య పనుల్లో తీవ్ర జాప్యం

వర్షాకాలంలో సీజనల్ రోగాలు ప్రజలను ప్రతీ ఏడాది ఇబ్బందులకు గురిచేస్తూనే ఉంటాయి. ప్రతీ ఏడాది మే, జూన్ నెలల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాల్సి ఉండగా చాలా చోట్ల నిర్లక్ష్య పనులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో దోమల వ్యాప్తి ఎక్కువై ప్రజలు డెంగ్యూ బారిన పడాల్సి వస్తోంది. ప్రతీ గ్రామ పంచాయతీ, మున్సిపల్‌లలో పారిశుధ్య పనుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్న స్థానిక అధికారులు బేఖాతర్ చేస్తూనే ఉన్నారు. మండలానికి ప్రత్యేకాధికారులు కేటాయించిన వారు తగిన సమయం కేటాయించకపోవడం, పలు గ్రామాల్లో కార్యదర్శులు విధులకు సరిగా హాజరుకాకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది పారిశుధ్య పనులలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇక మున్సిపల్‌లోనూ అదే పరిస్థితి నెలకొంటుంది. స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్న ఆ రోజు మాత్రమే పనులు చేస్తుండడంతో ఎక్కడ చెత్త అక్కడే, ఎక్కడ మురికి అక్కడే పేరుకపోతోంది. మున్సిపల్‌లో ఆయా వార్డులకు జవాన్‌లు ఉన్న ఎక్కువ శాతం జవాన్‌లు వారి సొంత పనులపైననే దృష్టిసారిస్తూ తూతూ మంత్రంగా కార్మికులు పనులు చేసేలా చూస్తు పారిశుధ్య పనులను విస్మరిస్తున్నారు. దీంతో ఆయా చోట్ల మురికి పేరుకపోయి దోమల సంతతి పెరిగి ప్రజలు దోమకాటు బారిన పడాల్సి వస్తోంది.

నిల్వ నీటితోనే..

ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇళ్ల మధ్య నీరు నిల్వ ఉండడంతో పాటు ఇంటిపై ఉన్న ట్యాంకులకు మూతలు లేకపోవడం, పూలకుండీల్లో వర్షపునీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండడం, ఇంటిపై ఉన్న పాత ఖాళీ డబ్బాలు, టైర్లు, ఖాళీ కొబ్బరి బోండాలు దోమలకు నిలయంగా మారుతున్నాయి. గతంలో ప్రాజెక్టులు, చెరువులు ఉన్న ప్రాంతాల్లోనే డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయని ప్రచారం జరిగినప్పటికీ ప్రస్తుతం జిల్లాలోని ఆయా మండలాల్లో అధిక సంఖ్యలోనే డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. నీటి నిల్వలు లేకుండా చూడడంలో పరిసర ప్రాంత ప్రజలు గాని, మున్సిపల్, గ్రామ పంచాయతీల సిబ్బంది దృష్టి సారించకపోవడంతో దోమలకు ఆవాసాలు ఏర్పడి వాటి సంతతి పెంచుకుంటుపోతున్నాయి. వారంలో ఒక్కరోజు డ్రైడేగా నిర్వహిస్తూ తూతూ మంత్రంగా నీటిని తీసేస్తున్నారే తప్ప తమ చుట్టు పక్కల ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నీటి కుంటల్లో నీరు నిల్వ ఉన్న సంగతి మాత్రం విస్మరిస్తున్నారు.

ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలి

మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



కామారెడ్డిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 22: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపటారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ వరంగల్ సభ సాక్షిగా ఎలాంటి షరతులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు మాట మారుస్తుందని అన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లె అక్కడ దేవుళ్లపై ఒట్టువేసి హామీలు ఇచ్చారని, హామీలన్నీ హామీలుగానే మిగిలాయని అన్నారు. రాష్ట్రంలో 49,100 లక్షల కోట్ల రూపాయలు రైతులు రుణాలుగా తీసుకుంటే, రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఆర్థిక మంత్రి రూ.7500 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. ఇలాంటి మాటలు చెప్పడానికి సిగ్గుండాలని తెలిపారు. ఒక్క కామారెడ్డి సింగిల్‌విండో పరిధిలో 42,018 మంది రైతులు రుణాలు తీసుకుంటే 791 మందికి మాత్రమే మాఫీ అయిందని, ఈ తీరున రాష్ట్రంలో కేవలం 35శాతం మందికి మాత్రమే రుణమాఫీ అయిందని తెలిపారు. రాష్ట్రంలో ఏ మంత్రి ఏం మాట్లాడుతున్నాడో అర్థం కాక రైతులు అయోమయంలో ఉన్నారని, ఆరు గ్యారెంటీల్లో హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. రాష్ట్రం లో రైతులందరికీ రుణమాఫీ అయ్యేదాకా రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తిలేదని, రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని అన్నారు. అదేవిధంగా తెలంగాణ సచివాలయంలో నూతనంగా నిర్మించిన గద్దెపై రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటుచేయడం పట్ల వ్యతిరేకిస్తూ తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోపిగౌడ్, వైస్ చైర్మన్ రవియాదవ్, నాయకులు గైని శ్రీనివాస్‌గౌడ్, గెరిగంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాల రెన్యూవల్ వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 22: అలసత్వం ప్రదర్శించకుండా పంట రుణాల రెన్యూవల్ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రుణమాఫీ పొందిన ప్రతీ రైతుకు పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎస్‌బీఐతో పాటు ఇతర బ్యాంకుల్లో పంట రుణాల రీషెడ్యూల్ చాలా తక్కువగా ఉందని వ్యవసాయశాఖాధికారులతో సమన్వయంతో పంట రుణాల రీషెడ్యూల్ చేయాలని, మహిళ స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు, మహిళ శక్తి రుణాల మంజూరుతో చాలా బ్యాంకులు వెనుకబడి ఉన్నాయని మహిళల రుణాల మంజూరుకు సహకరించాలని బ్యాంకర్లను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుంటూ త్వరగా రుణాలను మంజూరు చేయించాలని డీఆర్‌డీఓను ఆదేశించారు. మండల వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ త్వరగా రైతులకు పంట రుణాలు మంజూరు అయ్యేలా బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఇప్పటి వరకు రుణమాఫీ కాని జిల్లాలో 7087 మంది రైతులు దరకాస్తు చేసుకోవడం జరిగిందని రుణమాఫీ కాని లక్షలోపు, లక్షన్నర లోపు, రెండు లక్షల లోపు, రెండు లక్షల పైన రైతుల వివరాలను గ్రామాలు, బ్యాంకుల వారీగా రికార్డు చేసి ఆన్‌లైన్‌లో పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖాధికారి భాగ్యలక్ష్మీ, ఎల్‌డీఎం రవికాంత్, బ్యాంకర్లు, ఏడీఏలు తదితరులు పాల్గొన్నారు.

బోధన్, బాన్సువాడ సబ్ డివిజన్లకు సబ్ కలెక్టర్ల నియామకం



వికాత్ మహతో



కిరణ్మయి కొప్పిశెట్టి

నిజామాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం బోధన్, బాన్సువాడ రెవెన్యూ డివిజన్లకు ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులను జారీ చేశారు. బోధన్ సబ్ కలెక్టర్‌గా 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వికాత్ మహతోను నియమించింది. అక్కడ పని చేస్తున్న ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌ను బదిలీ చేసింది. ఐఏఎస్ శిక్షణ ముగించుకున్న ఆయనను బోధన్ సబ్ కలెక్టర్‌గా నియామకం చేశారు. గత కొన్నేళ్లుగా బోధన్‌కు ఆర్డీవోను నియమించగా ప్రభుత్వం ప్రస్తుతం ఐఏఎస్‌ను నియమించింది. కొత్తగా ఏర్పడిన బాన్సువాడ రెవెన్యూ డివిజన్‌కు ఇప్పటి వరకు ఆర్డీవో స్థాయి అధికారిని నియమించారు. కొత్తగా కిరణ్మయి కొప్పిశెట్టి 2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిని సబ్ కలెక్టర్‌గా నియమించారు. నిజామాబాద్ జిల్లాలోనే ట్రెయినీ కలెక్టర్‌గా ఆరు నెలల పాటు పని చేశారు. అక్కడ పని చేస్తున్న ఆర్డీవో రమేష్ రాథోడ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు సబ్ డివిజన్లకు కొత్తగా 2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులను నియమించింది.

పల్లెల్లో కానరాని ఫాగింగ్

- గ్రామాల్లో దోమల స్వైర విహారం
- చెత్తాచెదారం మురుగుతో పడకేసిన పారిశుధ్యం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

ఎల్లారెడ్డి, ఆగస్టు 22: ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించడం లేదు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. దోమల స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు ఆసుపత్రి బాటపడుతున్నారు. నిధులు లేక కనీసం ఫాగింగ్ కూడా చేయించలేక కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పల్లె ప్రజలు జ్వరంతో మంచం ఎక్కుతున్నారు. జిల్లాలో పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తరువాత ప్రతీ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. వారి విధులు నిర్వహించడమే కష్టంగా ఉన్న తరుణంలో అదనపు బాధ్యతలు వారికి తలనొప్పిగా మారింది. చాలా వరకు పంచాయతీలకు వెళ్లినా పాపాన పోలేరు.

నిధులు లేక అష్టకష్టాలు

జిల్లాలో 526 గ్రామం పంచాయతీలు ఉన్నాయి. అందుకు కార్యదర్శులు స్పెషల్ ఆఫీసర్లు ఉన్నారు. నిధులు అందించకపోవడంతో స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటి వరకు చాలా మంది పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి నెట్టుకొచ్చిన కొంత మంది కార్యదర్శులు బదిలీ అయి వెళ్లారు. మిగిలిన కార్యదర్శులు కొత్తగా వచ్చిన వారు కూడా మొహం చాటేసారు. చిన్న పంచాయతీలే కాక మేజర్ గ్రామ పంచాయతీలో కూడా అదే పరిస్థితి నెలకొంది. పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్‌కు డబ్బులు లేకుండా కార్యాలయంలో ఉంచుతున్నారు. బయటకు రావాలంటే కార్యదర్శి భయపడుతున్నారు. ఇంకా ఎంత వరకు అప్పులు తేగలమని స్థాయికి మించి అప్పులు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎవరూ ఏమనుకున్నా పర్వాలేదు. కాని ఫోన్లు కూడా ఎత్తటం లేదు. గ్రామాల్లో ప్రజలు మాత్రం పంచాయతీ కార్యదర్శులు కార్మికుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎవరికి చెప్పాలో తెలియక

ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక తర్జన భర్జన పడుతున్నారు. మురుగు కాలువలో నీరు తీసేవారు లేక మురికి కాలువలు కంపు కొడుతున్నాయి. దీంతో ఏ వీధిలో చూసినా చెత్తా చెదారం పేరుకుపోతున్నాయి. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు రోగాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం తరువాత ప్రజలను సమస్యలు వెంటాడుతున్నాయి. తాగునీరు, వీధి లైట్లు, మురికి కాలువలు భారిన సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సతమతమవుతున్నారు. కనీసం దోమల నివారణకు ఫాగింగ్ అయినా చేయించాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోజు వందల నుంచి వంద యాభై వరకు వస్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కళ్యాణి గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న చెత్త కుప్పలు

మురికి కాలువల్లో మురుగు తొలగించడం లేదు

- కాశీరాం, కళ్యాణి గ్రామం

నాలుగు నెలలుగా మురికి కాలువలో పేరుకుపోయిన మురుగు నీరు తొలగించడం లేదు. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వీధి లైట్లు వెలగక చాలా రోజులు అవుతుంది. గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ లేక ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్యం పనులు చేపట్టాలి.

ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి

- శ్రీనివాస్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ భిక్కనూరు

పంచాయతీల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. తాజా మాజీ సర్పంచ్‌లు సొంత డబ్బులతో గ్రామాల్లో అభివృద్ధికి ఖర్చు చేశారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి పంచాయతీలకు రావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసి గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

పారిశుధ్య పనులు చేస్తున్నాం

- లక్ష్మీ, ఎంపీడీవో, ఎల్లారెడ్డి

ఇప్పటికే గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రారంభించాం. పేరుకుపోయిన మురుగు నీటిని తొలగిస్తున్నాం. మండల వ్యాప్తంగా కార్యదర్శులను అప్రమత్తం చేసి పారిశుధ్యంపై చర్యలు తీసుకుంటున్నాం.

ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలు

దోమకొండ, ఆగస్టు 22 : మండల కేంద్రంలోని శ్రీ ఆముదాలపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 31న ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ప్రత్యేక పూజలు చేస్తామన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కామారెడ్డిటౌన్,ఆగస్టు 22 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌బీనగర్‌కు చెందిన కాకర్లవికాస్‌పై కేసు నమోదుచేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు మాచారెడ్డి మండల చింతల్ గ్రామానికి చెందిన పల్లపు నర్సింలు అనే వ్యక్తిపై 2021 సంవత్సరంలో వికాస్ తల్లి కాకర్లబాలమణిని చంపడనే నెపంతో పాతబస్టాండ్ నుంచి బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని అర్‌బీనగర్‌కు తీసుకుపోయాడు. అక్కడ చేతులను కట్టెసి కట్టెలతో, రాళ్లతో ఇష్టారీతిన దాడిచేయడంతో నర్సింలు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడని తెలిపారు. బాధితుడు నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'డ్రగ్స్‌ఫ్రీ తెలంగాణ కోసం పోరాటం'

కామారెడ్డిటౌన్, ఆగస్టు 22 : తెలంగాణ నవనిర్మాణ్ విద్యార్థిసేన ఆధ్వర్యంలో డ్రగ్స్‌ఫ్రీ తెలంగాణ కోసం యంగ్ సైరన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు టీఎన్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత సమాజంలో యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటుందన్నారు. అతి ప్రమాదకరమైన వ్యసనం డ్రగ్స్ అని, చాపకింద నీరులా డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు విస్తరిస్తున్నాయన్నారు. వ్యసనాల నుంచి యువతను దూరం చేసేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 22 : హత్యచేసిన కేసులో నిందితునికి జీవితఖైదు విధించినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. తాడ్వాయి మండలం సోమారం గ్రామానికి చెందిన పిట్ల గోపాల్,సంపంగి రవిలు మేకలు దొంగిలించాలని అనుకుని 2019 మే 22న సాయంత్రం కామారెడ్డి న్యూబస్టాండ్ నుంచి తుప్రాన్ వరకు వెళ్లారు. తుప్రాన్ వద్ద మద్యం తీసుకుని గజ్వేల్ రూట్‌లో నాచారం గ్రామశివారులో రోడ్డు నుండి కొంచెం దూరంలోకి వెళ్లి అక్కడ మద్యం తాగుతున్న సమయంలో రవికి ఫోన్‌రాగా మాట్లాడుతున్నాడు. గతంలో రవి, మృతుడు గోపాల్ భార్యకు వివాహేతర సంబంధం ఉంది. దీంతో రవి తన భార్యతోనే మాట్లాడుతున్నావంటూ మళ్లీ వివాహేతర సంబంధం పెట్టుకున్నావంటూ రవిని నిలదీశాడు. సంబంధం విషయం తెలిసిందని మనసులో పెట్టుకుని చంపాలని ఉద్దేశంతో మద్యం ఎక్కువగా తాగించి తల, మర్మాంగంపై కట్టెతో కొట్టగా మృతుడు పడిపోయాడు. తర్వాత చనిపోయాడని నిర్ధారించుకుని తర్వాత ఎవరు గుర్తుపట్టకుండా కొద్దిదూరంలో గల రెండు బండరాళ్లమధ్య పడేశాడు. మృతుడి ఇంటికి రాకపోవడంతో మృతుని భార్య తాడ్వాయి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని సాంకేతికత ఆధానంగా దర్యాప్తు చేయగా రవి హత్యచేసినట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. అప్పటినుంచి విచారణ కొనసాగగా గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ నిందితుడికి జీవితఖైదు, రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపా రు. ఈ కేసును చేదించేందుకు పనిచేసిన అప్పటి సీఐ రామాంజనేయులు, ఎస్ఐ అంజయ్య, వెంకట్, ప్రస్తుత సదాశివనగర్ సీఐ సంతోష్, యస్ఐ వెంకటేశ్వర్, పీపీ రాజగోపాల్‌గౌడ్‌లను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి : మాజీ ఎమ్మెల్యే



ఆర్మూర్‌లో రైతుల ధర్నాలో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వర్ని కెనరా బ్యాంకు మేనేజర్ నార్యను నిలదీస్తున్న రైతులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు22: ఎలాంటి ఆంక్షాలు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని మాజీఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులను మోసం చేస్తుందన్నారు. తక్షణమే ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని లేదంటే ఉద్యమం చేపడతామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతీ రైతుకు రూ.లక్ష రుణమాఫీ జరిగిందని, అప్పుడు లేని సాంకేతిక లోపాలు ఇప్పుడు ఉండకు వచ్చాయని ప్రశ్నించారు. ఒక్కో మంత్రి ఒక్కో మాట మాట్లాడుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు రైతులందరికి రుణమాఫీ చేస్తానని, ప్రతీనియోజకవర్గంలో దేవుళ్లపై ఒట్టు వేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తక్షణమే రైతులకు పంట పెట్టుబడి సహాయం కింద రైతు బంధు ఇచ్చి ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీని చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు గంగామోహన్‌చక్రు, లింబాద్రి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, సొసైటీ చైర్మన్ కాపెల్లి చిన్న ముత్తెన్న, మాజీ సర్పంచ్ గణేష్, సీనియర్ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్: రైతురుణమాఫీని రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలు ఆంక్షాలు అర్థం లేని షరతులే రైతులకు శాపంగా మారాయని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ షరతులు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా 24గంటల కరెంటు, సాగునీరు, పంట పెట్టుబడి అందించారని, గెలిచిన మొదట్లోనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ రుణమాఫీ పెద్ద మోసమని, ఎలక్షన్‌లో రూ.40వేల కోట్లు, కేబీకేట్‌లో రూ.31 కోట్లు, బడ్జెట్‌లో రూ.26కోట్లు ప్రకటించి ఇప్పుడు రూ.17వేల900కోట్లు చూపి, రూ.7500కోట్లు మాఫీ చేశారని మండిపడ్డారు.బీఆర్ఎస్ మొదటి సారి రూ.లక్ష చొప్పున రూ.35లక్షల మంది రైతులకు రూ.17వేల కోట్లు మాఫీ చేస్తానని వివరించారు.రైతుల ఆందోళనతో మంత్రులు తలలోమాట అంటున్నారని విమర్శించారు.అనంతరం తహసీల్దార్‌కువినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీ.మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, శ్రీనివాస్ గౌడ్, వంశీమోహన్, రాము, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: షరతులు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో రైతులతో కలిసి ధర్నాలు నిర్వహించారు. నగరంలోని ధర్నాచౌక్ వద్ద నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త మాట్లాడుతూ మాయమాటలతో అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం కుచ్చుటోపి పెట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్‌రావు, నగర అధ్యక్ష, కార్యదర్శులు సిర్పరాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, రవిచందర్, ప్రభాకర్‌రెడ్డి, ఎనుగందుల మురళి, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: రైతు రుణమాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫల మైందని మాజీ డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్‌లు ఆరోపించారు. గురువారం బోధన్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ర్యాలీగా ఆర్డీవో కార్యాలయంకు వెళ్లి ధర్నా నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సంజీవ్‌కుమార్, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగారాం,నాయకులు నక్కలింగారెడ్డి,రవిశంకర్‌గౌడ్, సంజీవ్‌పటేల్, గణేష్‌లతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నందిపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా అర్హులైన ప్రతీ రైతు రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు డిమాండ్ చేశారు. గురువారం నందిపేట మండల కేంద్రంలోని నంది విగ్రహం వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడి మచ్చర్ల సాగర్, నాయకులు ఉల్లి శ్రీనివాస్ గౌడ్, సయ్యద్ హుస్సేన్, కొత్తూర్ భాస్కర్, ఏర్రం ముత్యం, రాజన్న, బొడ్డు రాజశేఖర్, బాల గంగాధర్,ప్రవీణ్‌గౌడ్, దేవేందర్, మురళి తదితరులు ఉన్నారు.

నవీపేట: అర్హులైన రైతులందరికి 2లక్షల రూపాయల రుణమాఫీ అమలు చేయాలని కోరుతూ గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైన మిగిలిన రైతులందరికి రుణమాఫీ చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింగ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: రైతులందరికి ఏలాంటి అంక్షాలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం భీమ్‌గల్ పట్టణంలోని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్మూర్ మహేష్, చౌట్‌పల్లి రవి, శర్మనాయక్, శివసారి నర్సయ్య, ఓమాయి రాజేశ్వర్, మోహీస్, మహిపాల్, అబ్దుల్ రజక్, నర్సింహచారి, తదితరులు పాల్గొన్నారు.ఆలూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మర్కంటి మల్లేష్, నలిమెల మోహన్‌రెడ్డి, చిన్నారెడ్డి,రమేష్, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఏలాంటి ఆంక్షాలు లేకుండా రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూమేష్, పోగరి సంజీవ్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు రెంజల్‌మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ముందు బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతరం బీఆర్ఎస్ నాయకులు కాశం సాయిలు, మౌలానా, గోపాల్ రెడ్డి, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ఏకకాలంలో రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలంటు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ అన్నారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలో గాంధీచౌరస్తా వద్ద రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన ఇప్పుడు రైతులను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సామ వెంకటరెడ్డి, ఉమా శంకర్, రాజారెడ్డి, శ్రీనివాస్,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఎదుట గురువారం పంట రుణమాఫీ కోసం రైతులు ఆందోళనకు దిగారు. బ్యాంకు అధికారుల తప్పుడు కంప్యూటర్ నమోదు వల్లే పంట రుణాలు మాఫీ కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేనేజర్ నార్యాతో వాగ్వాదానికి దిగారు. తాము ఎలాంటి పొరపాటు చేయలేదని రుణమాఫీ కాని రైతుల కోసం వ్యవసాయ శాఖ అధికారికి సంబంధిత రైతు బయోడేటా పంపించి ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను తిరిగి లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తామని మేనేజర్ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెట్టకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని జాతీయరహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం రుణమాఫీ చేయడంలో రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ఆగస్టు 15లోపు రైతులందరికి రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కేవలం 30శాతం మంది రైతులకు రుణమాఫీ చేశారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఎలాంటి నిబంధనలు లేకుండా రుణాలు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కల్లెడ ఏలియా, మాజీఎంపీపీ శివలింగు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు రాజేశ్వర్, తీగెల సందీప్, వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దబజార్: ఎటువంటి అంక్షలు లేకుండా రైతులందరికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో రైతు డిక్లరేషన్ పేరుతో తెలంగాణ రైతులకు రెండు లక్షల రూపాయల రుణాలను డిసెంబర్ 9న సోనియమ్మ జన్మదినం సందర్భంగా రైతురుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

ఏర్గట్ల: మండలంలోని రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ మండలంలోని బిఆర్ఎస్ నాయకులు గురువారం తహసీల్దార్ శైలజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు బస్టాండ్ వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయాలని ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందజేశారు.ఈకార్యక్రమంలో భారస మండలా ధ్యక్షుడు రాజాపూర్ణానందం, మాజీఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్లు బర్మచిన్న నర్సయ్య, సోమిరెడ్డి శ్రీనివాస్, నాగిరెడ్డి రాజేందర్, దేవన్న యాదవ్, నాగులపల్లి అంజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎడపల్లి: రైతులందరికి రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అర్హులైన రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ధన్వాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దేరడి శ్రీరాం, మాజీ ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ ఎడపల్లి ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, నాయకులు అహ్మద్ ఖాన్,గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రైతు రుణ మాఫీని పూర్తి స్థాయిలో షరతులు లేకుండా అమలు చేయాలని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ యువ నాయకుడు బాజిరెడ్డి జగన్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం డిచ్‌పల్లి తెలంగాణతల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలని నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. రైతు రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా ప్రతి ఒక్కరికి వర్తింపజేయాలని కేసీఆర్ ప్రభుత్వం హయంలో ఏ పథకం నిధుల కోసం ఆగాలేదన్నారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రతినిధులు కొండ కృష్ణ, సాయిలు, పద్మరావు, మోహన్,బీఆర్ఎస్‌నాయకులు,కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వేల్పూర్: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ రైతుకు రూ.2లక్షల లోపు రుణమాఫీ చేయాలని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వేల్పూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రుణమాఫీపై రైతులు నిర్వహించిన ధర్నా నిరసన కార్యక్రమాలలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైడి నాగాధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, గంగారెడ్డి, బాల్‌రాజ్, నల్ల రమేష్, డొల్ల రాజేశ్వర్, లింబారెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించే వరకు
డబుల్ రోడ్డు వేయనివ్వం

● ఆర్ అండ్ బీ అధికారుల తీరును నిరసిస్తూ రాస్తారోకో



వర్ని-కోటగిరి రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్థులు

వర్ని,ఆగస్టు22: వర్ని మండల కేంద్రం నుంచి తగిలేపల్లి గ్రామం మీదుగా కోటగిరి మండల కేంద్రం వరకు నిర్మించ తలపెట్టిన ఆర్ అండ్ బీ రహదారి డబుల్ రోడ్డు నిర్మాణ పనులపై తగిలేపల్లి గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి ఇళ్లను నిర్మించుకున్న వారికి ఆర్ అండ్ బీ అధికారులు వత్తాసు పలుకుతూ మండల కేంద్రంలో దాటాక డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారని ఆందోళనకారులు విమర్శించారు. కోట్లాది రూపాయల ఆస్తులు కలిగి అడ్డదారిలో రోడ్డును ఆక్రమించిన వారి వద్ద అధికారులు లంచాలకు కక్కుర్తి పడి వారు ఆక్రమణలకు వత్తాసు పలుకుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నట్లు ఆరోపించారు. వర్ని, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాలతో పాటు ఆయా మండలాల పరిధిలోని ప్రజలకు, విద్యార్థులకు ఈ రహదారి ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆక్రమణలు తొలగించకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని తగిలేపల్లి, అంబం, రాంపూర్ గ్రామాల ప్రజలు స్పష్టం చేశారు. నిరసనలో గుజ్జ శంకర్, అశోక్, తొంట శంకర్, మైసం వెంకటి, బక్క శంకర్, రాములు, వడ్ల ప్రసాద్, మైసం శ్రీను, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధితో వ్యక్తి మృతి

నందిపేట, ఆగస్టు22: మండలంలోని బైపాస్ రోడ్డులో హోటల్‌కారి రవి (45)అనే వ్యక్తి మూర్ఛవ్యాధితో మృతి చెందినట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.మండలంలోని బజార్‌కొత్తూర్ గ్రామానికి చెందిన హోటల్‌కారి రవిచెప్పులు కుట్టుకొని జీవనం కొనసాగించగా మద్యానికి బానిసై ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్ళినట్లు పోలీసులు చెప్పారు. గురువారం బైపాస్‌రోడ్డులోని గాండ్లసంతోష్ పొలంలో శవమై కనిపించాడని ,పిట్స్‌తో పొలంలో పడిమృతి చెంది ఉంటాడని పోలీసులు పేర్కొన్నారు. మృతుని అన్న హోటల్‌కారి రాజు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏ హరిబాబు వివరించారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు

బోధన్‌రూరల్,ఆగస్టు22: బోధన్, సాలూర మండలాల్లోని గ్రామాల్లో పేకాట ఆడిన నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి అన్నారు. గురువారం హున్స గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద నుంచి రూ.1800 స్వాధీనం చేసుకున్నామన్నారు.పేకాట ఆడిజీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేశామన్నారు. ఇక నుంచి గ్రామాలలో పేకాట ఆడిన నిర్వహించిన సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణలో
ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

● ఎంపీడీవో సురేష్ బాబు



మొక్కలను నాటుతున్న ఎంపీడీవో

రుద్రూరు,ఆగస్టు22: పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగ స్వాములు కావాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం రుద్రూరు మండల సమీకృత కార్యాలయం ఆవరణలో ఆయన అధికారులతో కలిసి మొక్కలను నాటారు. నాటుదాం ఒక చెట్టు అమ్మపేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలు కురిసేందుకు, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం కోసం తమ వంతుగా ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మనోహర్, ఏపీఎం భాస్కర్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ సర్వేను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



జన్నేపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్



వన్నెల్(బి)లో ..

నవీపేట,ఆగస్టు22: మండలంలోని జన్నేపల్లిలో గురువారం ఎల్ఆర్ఎస్‌కు సర్వేను స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అంకిత్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగాదరఖాస్తులను సమగ్రంగా అధికారులు పరిశీలించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించడానికి వెళ్లడానికి ఒక రోజు ముందే దరఖాస్తులకు సమాచారం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్,ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులున్నారు.

ఎల్ఆర్ఎస్‌పై దరఖాస్తుల స్వీకరణ

ముప్కాల్: బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామంలో గురువారం ఎల్ఆర్ఎస్ -2020 దరఖాస్తులను డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ పరిశీలించారు. అనంతరం అమ్మ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. నాటిన ప్రతీ మొక్కను పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రతీ పంచాయతీలో పారిశుధ్యం కార్యక్రమం నిర్వహించాలని, దోమలు ప్రబలకుండా చర్యలు చేప ట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గంగామోహన్, ఇరిగేషన్ ఏఈ లింబాద్రి, ఎంఆర్ఐ భరత్, పంచాయతీ అధికారి రజనీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, కారోబార్‌భూషణ్ పాల్గొన్నారు.

అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టిన బైక్

● తండ్రి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన సగ్గు సాయన్న , వాహనం

నవీపేట,ఆగస్టు22: మండలంలోని హనుమాన్ ఫారం సమీపంలో గురువారం బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా కుమారుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వినయ్ తెలిపిన ప్రకారం నిర్మల్ జిల్లా కిర్గుల్(కే)కు చెందిన సగ్గు సాయన్న(74)తో పాటు అతని కుమారుడు సుభాష్‌లు కలిసి బైక్‌పై మాక్లూర్ మండలం గుంజిలిలో ఉన్న ఓ గృహ ప్రవేశానికి హజరయ్యారు. అనంతరం తిరిగి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మండలంలోని హనుమాన్ ఫారం సమీపంలో బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో సగ్గు సాయన్న అక్కడికక్కడే మృతి చెందగా అతని కుమారుడు సుభాష్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు సుభాష్ కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధితులకు న్యాయం చేయాలి



కలెక్టరేట్‌కు వచ్చిన నాగారం బాధితులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 22:నగరంలోని నాగారంలోగల భారతీరాణి కాలనీలో చెరువు భూమిలో ఇండ్లను నిర్మించారని మున్సిపల్ అధికారులు ఆ ఇండ్లను కూల్చివేయడం వల్ల చాలా మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని వారికి ఎలా ంటి రక్షణ లేకపోవడంతో ఎక్కడ ఉండలేని పరిస్థితి ఉందని కావున వారికి న్యాయం చేయాలని ఎంఐఎం నాయకులు గురువారం కలెక్టరేట్‌కు వచ్చారు. ఎలాంటి నోటీసులు, సమాచారం లేకుండా అక్రమ నిర్మాణాల పేరుతో కూల్చివేయడం సరికాదని ఇతర స్థలాలలో వెంటనే డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిరుపేదలకు ఇవ్వాలని కోరారు. సర్వే నెంబర్ 249 డివిజన్ నంబర్ 13లో ఉన్న రెవెన్యూ భూమిని పేదలకు కేటాయించాలని కోరారు. కలెక్టరేట్‌కు వచ్చిన వారిలో ఎంఐఎం నాయకులు, డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, షకీల్ ఫైమద్, ఫాజిల్, మునావర్ అలీ, షహబాస్, రియాజ్, తదితరులు ఉన్నారు.

జీవో నెంబర్ 28ని రద్దు చేయాలి

బోధన్‌రూరల్,ఆగస్టు22: బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో పీఆర్‌టీయూ డివిజన్ అధ్యక్షులు ఎంబెల్లి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 2018ఆగస్టు 23న జీవో నెంబర్ 28ని అమలు చేస్తూ సీపీఎస్ విధానాన్ని ఉద్యోగులకు అమలులోకి తీసుకువచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం సీపీఎస్ విధానికి అనుకూలంగా జీవో నెంబర్ 28ని అమలులోకి తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీరని ఆశానిపాతానికి గురి చేసిందన్నారు. కావున జీవో నెంబర్ 28ని రద్దు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానంలోనే తీసుకువెళ్లాలన్నారు. ఆగస్టు 23 సీపీఎస్ వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటామని జీవోను వ్యతిరేకిస్తూ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, అర్బన్ మండల అధ్యక్షులు కైరన్, గంగాధర్, వీరేష్ బాబు, నిజాముద్దీన్, శంకర్, ప్రాథమిక సభ్యులు, సీపీఎస్ బాధితులు తదితరులున్నారు.

నరికి వేతకు గురైన అటవీ పరిశీలన



నరికి వేతకు గురైన అటవీని పరిశీలిస్తున్న సీఐ బిక్షపతి

సిరికొండ ఆగస్టు 22 : సిరికొండ సమీపాన గల 408 కంపార్టుమెంట్‌లో నరికివేతకు గురైన అటవీని ధర్పల్లి సీఐ బిక్షపతి గురువారం సందర్శించారు. బొడ్డుమామిడి చెరువు సమీపాన సిరికొండకు చెందిన కొందరు గిరిజన యువకులు విచ్చల విడిగా అడవీని నరికి వేసిన తెలుసుకున్న సీఐ బిక్షపతి, ఎస్ఎల్.రామ్ తమ సిబ్బందితో కలిసి నరికి వేతకు గురైన అడవీని దగ్గరుండి గమనించారు. ఎన్ని ఎకరాల వరకు నరికి వేశారో ఫారెస్టు డిప్యూటి రేంజ్ అధికారి గంగారాంను అడిగి తెలుసుకున్నారు. తండాకు చేరుకుని గిరిజనులతో సీఐ మాట్లాడారు. తండాలో తీజ్ పండగాను జరుపుకుంటున్నామని శుక్రవారంపోలీస్ స్టేషన్‌కు వస్తామని గిరిజనులు చెప్పడంతో సీఐ ,ఎస్సై అటవీశాఖ అధికారులు తిరిగి వచ్చారు. లొంక తండాకు సమీపాన నరికివేతకు గురైన అటవీభూమిని కూడ సీఐ,ఎస్సై పరిశీలించారు.వారి వెంట డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం, బీట్ అధికారి శశాంక్ తదితరులు ఉన్నారు.

● సిరికొండ తండాకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు

డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం మాట్లాడుతూ సిరికొండ తండాకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీరే కాకుండా ఇంక కొందరిపై కేసు నమోదు అవుతుందన్నారు. హుస్సేన్‌నగర్‌కు చెందిన ఎనిమిది మందిపై రెండు కేసుల చొప్పున నమోదు చేసినట్లు గంగారాం తెలిపారు.

కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక
గుండెపోటుతో తండ్రి మృతి



వేంటేష్,సాయికుమార్(ఫైల్)

బోధన్‌రూరల్,ఆగస్టు22: బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన యువకుడు సాయికుమార్ మూడు రోజుల కిందట కందకుర్తి గోదావరి నదిలో ఈత కోసం అని వెళ్లి మృతి చెందడం జరిగింది. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి దేవర్ల వెంకటేష్(54) పదే పదే కొడుకును గుర్తు చేసుకుంటూ ఉండేవాడని గ్రామస్థులు తెలిపారు. గురువారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి గుండెపోటుతో మరణించడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

హైదరాబాద్ తరలి వెళ్లిన
సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యకర్తలు

సిరికొండ ఆగస్టు 22: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలని కోరుతూ హైదరాబాద్‌లోజరిగే ధర్నా కార్యక్రమానికి సిరికొండ మండలానికి చెందిన సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ కార్యకర్తలువాహనల్లో తరలివెళ్లారు. సుందరయ్య విజ్ఞాన పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు జరిగే ర్యాలీకి కార్యకర్తలు తరలివెళ్లినట్లు ఆపార్టీ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ తెలిపారు.

రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నవీపేట,ఆగస్టు22: మండలంలోని సిరన్‌పల్లిలో గురువారం రుణమాఫీ వర్తించని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఏవో నవీన్‌కుమార్, ఏఈవో రాజహంస, తదితరులున్నారు.

నాడాపూర్‌లో దొంగతనం

నవీపేట,ఆగస్టు22: మండలంలోని నాడాపూర్‌లో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. ఎస్ఐ వినయ్ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన వినోకర్, సరలత దంపతులు రాత్రి భోజనం చేసిన అనంతరం తమ కింది ఇంటికి తాళం వేసి పైన ఉన్న ఇంట్లో నిద్రించారు. గురువారం ఉదయం కింది ఇంటిని పరిశీలించగా తాళం పగులగొట్టి ఉంది. గుర్తు తెలియని దొంగలు తాళాన్ని పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. లోపల ఉన్న బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న రెండు తులాల బంగారం, 16తులాల వెండితో పాటు 1.30లక్షల రూపాయల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. సంఘటనకు సంబంధించి బాధితురాలు సరలత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు22:జిల్లాలోని బీసీ,ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వ హించాలని యునైటెడ్ భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సిద్దాల నాగరాజు, కార్యదర్శి పెద్ది సూరిలు అన్నారు. గురువారం పట్టణంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ, బీసీ గురుకులాలు రెసిడెన్షియల్ కాలేజీ దాదాపు 50కి పైగా ఉన్నాయని, మౌళిక సదుపాయాలు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడుతు న్నారని అన్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై స్పెషల్ డ్రైవ్

ముప్కాల్, ఆగస్టు22: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల చొప్పున రుణమాఫీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని మూడు దఫాల్లో రూ.2లక్షల రుణ మాఫీ పంట రుణాలు కలిగి ఉన్న కుటుంబాలకు చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారి లావణ్య తెలిపారు. గురువారం బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వ ర్యంలో రైతురుణమాఫీకి సంబంధించిన స్పెసల్‌డ్రైవ్ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎస్సై, బి. నరేష్ వ్యవసాయాధికారిణి రేష్మ, రైతులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని టావెరా బోల్తా

● యువకుడి మృతి.. పలువురికి గాయాలు



సల్మాన్(ఫైల్)

నవీపేట,ఆగస్టు22: మండలంలోని అబ్బాపూర్(ఎం) పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం రాత్రి టావెరా వాహనం డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం నిర్మల్ జిల్లా భైంసా నుండి పలువురు యువకులు బోధన్‌లోని జలాల్ బుకారి దర్గాలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాలలో పాల్గొనడానికి టావెరావాహనంలో బయలుదేరారు.టావెరావాహనం అబ్బాపూర్ (ఎం)సమీపంలో అదుపు తప్పిడివైడర్‌ను డీకొని బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న సల్మాన్(25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి.గాయపడిన వారికి చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

బాన్సువాడ, ఆగస్టు 22 : బాన్సువాడ పట్టణంలోని సన్‌షైన్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు కరాటే, కుంపు పోటీల్లో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, రజతం మొత్తం 36 పథకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. ఈనెల 18న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లోని ఇండూర్ స్టేడియంలో నిర్వహించిన 35వ కరాటే, కుంపూ జాతీయ స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 36 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందులో 17 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్, 8 మంది విద్యార్థులు సిల్వర్ మెడల్, 11 మంది విద్యార్థులు రజతం మెడల్ సాధించడం జరిగిందని ఆయన తెలిపారు. అదే విధంగా పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి షేక్ అరబ్ రెండు గోల్డ్ మెడల్ కుంపూలో సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

వీరాపూర్ దుబ్బాలో ఇద్దరి అదృశ్యం

బీర్కూర్, ఆగస్టు 22 : బీర్కూర్ మండలం వీరాపూర్ దుబ్బాకు చెందిన కడమంచి పెద్ద కాశీరామ్ అనే వ్యక్తి ఈనెల 20న అదృశ్యమయ్యాడు. వీరాపూర్ దుబ్బాకు చెందిన కాశీరాం అనే వ్యక్తి కూలీ నాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా ఈ నెల 20న బయటకు వెళ్లి వస్తానని తన భార్యతో చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో భార్య గంగామణి గ్రామంలో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీసింది. అయినా కాశీరం ఆచూకి లభించలేదు. దీంతో గంగామణి బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. వీరాపూర్ దుబ్బాకు చెందిన అల్లం సరోజ అనే మహిళ ఈనెల 20న అదృశ్యం అయినట్లు పోలీసులు తెలిపారు. వీరాపూర్ దుబ్బాకు చెందిన సరోజ భర్త రమేష్ ఈ నెల 20న కూలీ పని కోసం బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లో తన భార్య సరోజ కనిపించలేదు. ఆమె ఆచూకీ లభించలేదు. అనంతరం రమేష్ బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యేను దూషించిన వ్యక్తిపై కేసు

బీర్కూర్, ఆగస్టు 22 : అసభ్యపదజాలంతో దూషిస్తూ చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన ఆరే సాహెబ్‌రావు అనే వ్యక్తి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డితో పాటు దామరంచ విండో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, సతీష్‌లపై అసభ్య పదజాలంతో దూషిస్తూ, చంపుతానని బెదిరిస్తూ వీడియో చిత్రీకరించాడు. అనంతరం సోషల్ మీడియాలో వీడియోలు పోస్టు చేశాడు. సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయింది. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపాడు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పరువుకు భంగం కలిగించే విధంగా దూషించినందుకు రాజకీయంగా ఇరు వర్గాల మధ్య గొడవ పెట్టేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు గాను మాజీ ఎమ్మెల్యే వర్గీయులు బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైరాపూర్‌లో విద్యార్థి ఆచూకీ లభ్యం

బీర్కూర్, ఆగస్టు 22 : బైరాపూర్‌కు చెందిన దుర్గాప్రసాద్ అనే విద్యార్థి బుధవారం బీర్కూర్‌లో పాఠశాలకు వచ్చి అదృశ్యమవగా, గురువారం బీర్కూర్‌లో రోడ్డుపై తిరుగుతుండగా పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన దురాప్రసాద్ అనే విద్యార్థి బీర్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం స్కూల్ కు వెళుతున్నానని చెప్పి బీర్కూర్‌కు వచ్చాడు. పాఠశాలలో తరగతి గదిలో బ్యాగును పెట్టి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం పాఠశాల ఉపాధ్యాయు ి దుర్గాప్రసాద్ తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ప్రసాద్ క్లాస్ రూమ్‌లో బ్యాగ్ పెట్టి ఏటో వెళ్లి పోయాడని చెప్పారు. తల్లిదండ్రులు బీర్కూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా గురువారం బీర్కూర్‌లో రోడ్డుపై వెళుతుండగా ప్రసాద్ కనిపించాడు. పోలీసులు ప్రసాద్‌ను తండ్రికి అప్పగించారు.

వర్గీకరణ బిల్లును అమలు చేయాలి : జుక్కల్ ఎమ్మెల్యే

మద్నూర్, ఆగస్టు 22 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సైతం ప్రజాప్రతినిధులతో కలిసి తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. వెనుకబడి ఉన్నారని, ఎస్సీ వర్గీకరణతో వారికి న్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లలో జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

హైదరాబాద్ నిరసనలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, ఆగస్టు 22 : అదానీ కుంభకోణంపై స్కాంను బీజేపీ ప్రభుత్వం కప్పి పుచ్చేదానికి చేస్తున్న ప్రయత్నం తీరును నిరసిస్తూ గురువారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ కార్యాలయం ముందు టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ నిరసనలు, ప్రదర్శనలు చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

భిక్కనూరు, ఆగస్టు 22: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని సమాచార హక్కుచట్టం జిల్లా ప్రతినిధి గంగల రవీందర్ అన్నారు. గురువారం భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతిరోజు రన్నింగ్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు టీషర్టులను, క్రీడా పరికరాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించాలన్నారు. క్రీడాకారులకు తాము పూర్తి సహకారం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్, పీడీ నర్సింహారెడ్డి, యువకులు బండి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఫ్యాక్టరీపై అధ్యయన కమిటీ

● ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



సభలో మాట్లాడుతున్న ఆగ్రో చైర్మన్ బాల్‌రాజ్

నిజాంసాగర్, ఆగస్టు 22 : నిజాంషుగర్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం అధ్యాయన కమిటీ వేసిందని, ఈ కమిటీ ఇచ్చే రిపోర్టు మూలంగా ప్రభుత్వం ఫ్యాక్టరీ తెరిచేందుకు చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. గురువారం నిజాంసాగర్ మండలం మాగి గాయత్రీషుగర్ కర్మాగారం ఆవరణలో సీడీసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆగ్రోచైర్మన్ బాల్‌రాజ్ మాట్లాడారు. సీడీసీ చైర్మన్‌గా ప్రభుత్వం షాదుల్లాను ప్రభుత్వం నియమించిందని, చైర్మన్ నారాయణ ఖేడ్ ప్రాంతానికి చెందిన వారు కావడంతో ఆ ప్రాంత రైతులు చెరకు పండించేందుకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు అవసరమైన రసాయనిక ఎరువులు, తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్యాక్టరీ వైస్ చైర్మన్‌గోపాల్ రావుకు పలు సూచనలు చేశారు. రైతులు ఫ్యాక్టరీకి చెరుకు అందించి నష్టపోతే యాజమాన్యం ప్రోత్సాహకాలు అందించాలన్నారు. చెరుకు ఫ్యాక్టరీకి రావడం లేదని, చెరకు పండించే రైతులు తక్కువగా ఉన్నారని, ఆధునిక పద్ధతి చెరుకు సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు మెళుకువలు పాటిస్తే 60 నుంచి 70 శాతం సాగుభూముల్లో చెరుకు పండించవచ్చన్నారు. సమావేశంలో నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ రైతుల పేరిట ఫ్యాక్టరీ యాజమాన్యం తీసుకున్న రుణాలు వెంటనే బ్యాంకులలో చెల్లించాలన్నారు. రైతులకు నష్టం జరుగకుండా చూడాలన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో షుగర్ ఫ్యాక్టరీ కర్మాగారం ఉన్నప్పటికీ నారాయణ ఖేడ్ నియోజకవర్గంలో ఎక్కువ చెరుకు పండిస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, ఫ్యాక్టరీ జీఎం వెంగళ్ రెడ్డి, పర్సనల్ ఆఫీసర్ గణపతి, నారాయణ ఖేడ్, జుక్కల్ నియోజకవర్గాల నాయకులు, రైతులు, తదితరులున్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

● ఆంక్షలు లేకుండా అమలు చేయాలి ● బీఆర్ఎస్ నాయకుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్



దోమకొండలో..

పిట్లం ఆగస్ట్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మాట మార్చడం సరి కాదని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమేష్ అన్నారు. గురువారం పిట్లంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు దీక్ష కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, వెంకట్‌రాంరెడ్డి, రజినీ కాంత్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

బాన్సువాడ : రైతులను, ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మండిపడ్డారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రైతు ధర్నా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు. త్వరలో బాన్సువాడకు మాజీ మంత్రి కేటీఆర్ వస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, మోచి గణేష్, ఆరీఫ్, గౌస్, సద్దాం, రమేష్ యాదవ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు : మండలకేంద్రంలోని సినిమా టాకీసు చౌరస్తాలో గురువారం బీఆర్ఎస్ నాయకులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, విండో చైర్మన్లు వెంకట్‌రెడ్డి, భూంరెడ్డి, రాజాగౌడ్, వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ఎంపీపీ పాల్గొన్నారు.

మాచారెడ్డి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలచంద్రం అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్, తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దోమకొండ: రైతులకు ఎలాంటి అంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని గురువారం దోమకొండ, బీబీపేట మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పరికి ప్రేమ్ కుమార్, గండ్ర మదుసుధన్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చినట్టుగా రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో దోమకొండ, బీబీపేట మండలాల మహిళ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద : ఇచ్చినహామీలు నెరవేర్చని చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతుల సొసైటీ వద్ద బీఆర్ఎస్ పార్టీ రైతులందరికీ ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీవర్తింపజేయాలని మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రావుదేశాయ్,మాజీ ఎంపీపీ అశోక్‌పటేల్, నాల్చర్‌రాజు, బాలు,బస్వరాజ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : ఏకకాలంలో ఎలాంటి షరతులు లేకుండా రెండులక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలవంతరావు తెలిపారు. గురువారం రాజంపేట మండల కేంద్రంలోని కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ప్రధాన చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, మోహన్‌రెడ్డి, నాగభూషణం, రమేష్,బాలరాజ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, బాలయ్య, రవి,భాస్కర్, సిద్ధిరాములు, గణేష్, రాజు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : ప్రభుత్వం రైతు భరోసా నిధులను ఇప్పటికీ విడుదల చేయలేదని, బేషరతుగా రైతుభరోసా నిధులు విడుదల చేయాలని ఉభయ జిల్లాల మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు డిమాండ్ చేశారు. గురువారం నిజాంసాగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని కూడలి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీకి ఆంక్షలు విధిస్తున్నారని, వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహా రెడ్డి, వాజీద్ అలీ, కళ్యాణి విఠల్ రెడ్డి, జ్యోతి దుర్గారెడ్డి, మనోహర్, మహ్మద్‌నగర్,నిజాంసాగర్ మండలాల అధ్యక్షులు సత్యనారాయణ, రమేష్ గౌడ్, గైని విఠల్, సంగమేశ్వర్ గౌడ్, లక్ష్మీ నారాయణ, అనసూయ సత్యనారాయణ, దేవదాస్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు కార్యకర్తలు రైతులతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్ర మంలో నాగిరెడ్డిపేట మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నర్సింలు, సాయిలు, కపిల్‌రెడ్డి, బలరాం నాయక్, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

మద్నూర్ : జుక్కల్‌మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రెండు లక్షల రూపాయల రుణమాఫీని వెంటనే చేయాలని, రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.



ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా పరిషత్ మాజీచైర్మన్

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

సూపర్‌వైజర్ దేవకర్ణ

మద్నూర్, ఆగస్టు 22 : అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుందని వాటి రూపురేఖలు మారుతాయని డోంగ్లి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దేవకర్ణ అన్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం పరిశీలించారు. లింబూర్, తడి హిప్పర్గ, డోంగ్లి మండలంలోని టాక్, లింబూర్, అంగన్‌వాడీ కేంద్రాల ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆమె చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఏకరూప దుస్తులను ఇవ్వనున్నట్లు, అదే విధంగా నూతన విద్యావిధానం ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలకు సంరక్షక కేంద్రాలుగా మారనున్నాయని ప్రతి ఇంట్లో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చాయని, వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని చిన్నారులకు ఇబ్బంది కలుగకుండా సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు.

డబుల్‌బెడ్‌రూమ్ పెండింగ్ పనులు పూర్తి చేయాలి

● ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, ఆగస్టు 22 : ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో పెండింగ్‌లో పనులు త్వరగా పూర్తిచేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నెప్రభాకర్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ విద్యుత్ మురికి కాలువలు రోడ్ల పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు ఆర్డీవో మన్నె ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి తహసీల్దార్ మహేందర్, పంచాయతీ రాజ్ డీఈ గిరిధర్, విద్యుత్ ఏడీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పోచారం కాలువలో పడి వృద్ధుడి మృతి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 22 : కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన వృద్ధుడు ప్రమాదవశాత్తు పోచారం ప్రధాన కాలువలో పడి మృతిచెందిన సంఘటన మండలంలోని తాండూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ గ్రామానికి చెందిన గుట్ట మీది రాజయ్య (60) బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి నుంచి సైకిల్ పైన బయటికి వెళ్లాడు. ఆయన ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని కోసం గాలించగా తాండూర్ బ్రిడ్జి వద్ద పోచారం కాలువలో అతని మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. రాజయ్య కాలకృత్యాలకు వెళ్లిన ప్రమాదవశాత్తు పోచారం కాలువలో పడి నీట మునిగి మృతిచెందినట్లు ఆయన తెలిపారు. మృతుని భార్య సత్యవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పిట్లం ఆగష్ట్ 22 : మండలంలోని అన్నారం గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తాగునీరు లేక 15 రోజులుగా అవస్థలు పడుతున్నా సమస్యలు ఎవరూ పట్టించుకోకపోవడంతో గ్రామపంచాయతీ ముందు నిరసన వ్యక్తం చేశామన్నారు. ప్రతిరోజు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు తెలిపారు. ఆరు బయట నుంచి నీటి కోసం రాత్రి పగలు తీసుకొని రావడం ఇబ్బందికరంగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని మహిళలు కోరుతు న్నారు.

విద్యార్థులకు క్రీడా వస్తువుల అందజేత

కామారెడ్డిటౌన్,ఆగస్టు 22 : కామారెడ్డి గంజ్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు హాకీ, బ్యాడ్మింటన్ కిట్స్‌లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు మహ్మద్ఇలియాస్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు క్రీడ వస్తువులు అందించామని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు,వారి బంధువులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కన్నయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వనితరవి, నిమ్మమోహన్‌రెడ్డి,కారంగుల అశోక్‌రెడ్డి, పుట్నాల శ్రీనివాస్, గంగాధర్, రమేష్‌శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ

దోమకొండ, ఆగస్టు 22 : మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలియాస్ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తీగల తిర్మల్‌గౌడ్,అనంత్‌రెడ్డి, తాటిపల్లి శ్రీకాంత్, నర్సారెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, సీతారాం ప్రసాద్, నాగేంద్రవర్మ, లింగం, రమేష్, మధు ఉన్నారు.

ఎమ్మెల్సీ నిధుల దుర్వినియోగంపై సీఎంఓకు ఫిర్యాదు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 22 : కామారెడ్డి జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన పీఆర్‌టీయూ భవనాలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కురరఘోత్తమ రెడ్డి నిధులను కేటాయించడంపై సీఎంఓకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటి తెలిపారు. ఇటీవల పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశంలో భిక్కనూరు, ఎల్లారెడ్డి మండలాల్లో పీఆర్‌టీయూ భవనాలకు రూ.10 లక్షలు, కామారెడ్డి భవనానికి రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు కేటాయించాల్సిన ఎమ్మెల్సీ నిధులను కేవలం ఒక ఉపాధ్యాయ సంఘ భవనంకు కేటాయించడం యావత్ ఉపాధ్యాయ సంఘాలను విస్మయానికి గురిచేస్తుందన్నారు. ఈ ఉత్తర్వులను రద్దుచేసి ఆ నిధులను పాఠశాల అభివృద్ధికి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

భిక్కనూరులో కొనసాగుతున్న జ్వర సర్వే

భిక్కనూరు, ఆగష్టు 22: భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని అన్నిగ్రామాల్లో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్వర సర్వే కార్యక్రమం కొకనసాగుతుంది. గురువారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆశలు, వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేయడంతో పాటుగా వారి వివరాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి యేమిమా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ మేరకు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కేజీబీవీ బదిలీల్లో నిబంధనలు అమలు చేయాలి'

కామారెడ్డిటౌన్,ఆగస్టు 22 : కేజీబీవీ బదిలీల్లో నిబంధనలు అమలుచేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ చేపడుతున్న కేజీబీవీ బదిలీల నిబంధనలో గరిష్ఠ కాలపరిమితి నిబంధన లేకపోవడం వలన ఈ బదిలీలు కొందరికి ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. గత 15 సంవత్సరాల నుంచి సుదూర ప్రాంతాలలో ఒకే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తీవ్రనష్టాన్ని కలగచేస్తుందని ప్రభుత్వం వెంటనే 8 సంవత్సరాల గరిష్ఠ నిబంధనను అమలుచేయాలని టీపీటీఎఫ్ జిల్లాశాఖ డిమాండ్ చేస్తుందని అన్నారు. కనీసకాలపరిమితి రెండు సంవత్సరాలు పెట్టినప్పుడు గరిష్ఠకాలపరిమితి 8 సంవత్సరాలు పెట్టడం వలన ఎక్కువ మంది ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అలాగే కేజీబీవీలలో పనిచేసే వృత్తివిద్యా శిక్షకులకు కూడా బదిలీలు చేపట్టాలని అన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి

● ఫారెస్టు రేంజ్ అధికారి వాసుదేవ్

నాగిరెడ్డిపేట, ఆగస్టు 22 : పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని నాగిరెడ్డిపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి వాసుదేవ్ అన్నారు. ఆయన గురువారం విద్యార్థులతో కలిసి మాల్తుమ్మెదలో మొక్కలు నాటారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోది ప్రతి ఒక్కరు తన తల్లి పేరిట ఒక మొక్క నాటాలనే లక్ష్యంతో చేపట్టిన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. మండలంలోని మాల్తుమ్మెద వద్ద గోపాల్‌పేట్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి రవికుమార్, ఫారెస్ట్ బీట్ అధికారులు నవీన్, లావన్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సదాశివనగర్:ప్రతి ఒక్కరు మొక్కలను సంరక్షించాలని తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీఓ సంతోష్‌లు తెలిపారు. గురువారం సదాశివనగర్‌మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో అమ్మకు ఒక మొక్క అనే పేరుతో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకుని పెంచాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేందర్, అధ్యాపకులు భానుమతి, రాజశేఖర్, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : మండల కేంద్రంతో పాటు గ్రామాలలో అధికారుల సమక్షంలో ఒక్కచెట్టు అమ్మపేరు నాటుదాం అనే కార్యక్రమం గురువారం డీఎల్‌పీఓ శ్రీనివాస్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల సంక్షేమ సంఘాలల్లో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి గ్రామంలో నిర్వహించడం జరిగిందన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- డబుల్ ఇస్మార్ట్
దర్శన్	- మిస్టర్ బచ్చన్
ప్రియా 70ఎంఎం	- తంగలన్
ప్రియా 35ఎంఎం	- ఆయ్

బాన్సువాడ

మహేశ్వరి	- మిస్టర్ బచ్చన్
వేంకటేశ్వర	- డబుల్ ఇస్మార్ట్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

